మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం..

- కాంగ్రెస్‌కు మిగిలింది గాడిద గుడ్డే..
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- కేంద్రం ఇచ్చే ఇండ్లకు ఇందిరమ్మ పేరు పెడితే ఊరుకోం..
- బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం..
- మీడియా సమావేశంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** కాంగ్రెస్ మీద ప్రజలకు నమ్మకం పోయిందని, అందుకే మొన్న మహారాష్ట్రలో, నిన్న ఢిల్లీలో గాడిద గుడ్డే ఇచ్చారని ఎంపీ డీకే అరుణ ఎద్దేవా చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ ఓటమిపై మహబూబ్‌నగర్ బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. గాడిద గుడ్డు నెత్తిన పెట్టుకొని ఊరేగిన రేవంత్‌కు అదే రిటర్న్ గిఫ్ట్ వచ్చిందని సెటైర్ వేశారు. ఢిల్లీలో బీజేపీది చారిత్రత్మక విజయమని పేర్కొన్నారు. అభివృద్ధిని అటకెక్కించిన ఆప్‌ను ఢిల్లీ ప్రజలు ఊడ్చేశారని, ఏ చీపురు గుర్తుతో ఆప్ అధికారంలోకి వచ్చారో అదే చీపురు గుర్తుతోనే ఊడ్చేశారని చెప్పారు. మోదీ అభివృద్ధి గ్యారంటీకి ఢిల్లీ ప్రజలు ఓటు వేశారని చెప్పారు. కాంగ్రెస్‌ను ఇక నమ్మే పరిస్థితి లేదని, ప్రజల్లో పూర్తి విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. గతంలో అధికారంలో ఉన్నా కాంగ్రెస్‌కు ఒక్క సీటు రాలేదని, ప్రతిపక్ష నాయకుడుగా రాహుల్ విఫలం అయ్యారని, ఇక్కడేమి చేతగాక.. తెలంగాణలో చార్సవు బిస్ హామీలు ఇచ్చి అమలు చేయని కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకోవాలని ఎద్దేవా చేశారు. దేశంలో కాంగ్రెస్ పని అయిపోయినట్లే అని స్పష్టమవుతుందన్నారు. కాంగ్రెస్ ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. పీఎం అవాస్ యోజన నిధులతో ఇందిరమ్మ ఇళ్ళు అని పేరు పెడితే ఊరుకోమని, చిత్తశుద్ధి ఉంటే ఇందిరమ్మ ఇళ్ళు వేరే కట్టించాలని, లేదా పేరు మార్చాలని ఎంపీ సూచించారు. ఇందరిమ్మ ఇండ్లు అనేది ఒక ఎన్నికల స్టంట్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఇందిరమ్మ ఇళ్ల డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. ప్రజలు కర్రుకాల్చి వాత పెడితేనే.. ప్రజలకు ఇండ్లు వస్తాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్తేనే ప్రజలకు పథకాలు, హామీలు అమలవుతాయని పేర్కొన్నారు. ప్రజల్ని మోసం చేసిన కాంగ్రెస్‌కు సీఎం రేవంత్‌రెడ్డికి కేజ్రీవాల్ గతే పడుతుందన్నారు. ప్రశ్నించే గొంతు కావాలంటే తెలంగాణాలో బీజేపీ రావాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ లు అభివృద్ధికి కేంద్రమే నిధులు ఇస్తోందని, ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు. అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చేదిగా కేంద్రం బడ్జెట్ రూపొందించడం జరిగిందన్నారు. రూ.12 లక్షలు లోపు ఆదాయం ఉన్నవారికి టాక్స్ మినహాయింపు ఇవ్వడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి శ్రీనివాస్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

## పేదోడి సొంతింటి కల సాకారం చేస్తాం

**మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి**



ఇంటి నిర్మాణానికి భూమి పూజచేస్తున్న ఎమ్మెల్యే

**మక్తల్,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రతి పేదోడి సొంతింటి కల సాకారం చేస్తామని మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మక్తల్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఇందిరమ్మ ఇండ్లనమూనా ఇంటి నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతున్నదని, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జి.లక్ష్మారెడ్డి, కోళ్ల వెంకటేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, కట్ట సురేష్, కట్ట వెంకటేష్, భూత్పూర్ చెన్నయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మామూళ్లు... షరా మామూలే..

- ప్రతి మద్యం దుకాణం నుంచి పైసా వసూలు..?
- ఎక్సైజ్ ఎస్సై నుంచి సూపరింటెండెంట్ దాకా..
- ఒక్కొక్కరికి ఒక్కో రేటు..?
- ఒక్కో గ్రామంలో పదికి పైగానే బెల్ట్ షాపులు..
- అధిక ధరలకు విక్రయిస్తున్నా పట్టించుకోని వైనం
- అన్ని తెలసినా తూ తూ మంత్రంగా తనిఖీలు..



వనపర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్

**వనపర్తి ప్రతినిధి ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** జిల్లాలో మద్యం షాపుల నుంచి ఎక్సైజ్ అధికారులకు మామూళ్లు షరా మామూలుగానే ముడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఉన్న అన్ని మద్యం షాపుల నుంచి సదరు అధికారులకు ముడుపులు ముడుతున్నట్లు సమాచారం. పల్లె పట్టణం అనే తేడా లేకుండా జిల్లావ్యాప్తంగా ఎన్నో బెల్ట్ షాపులు వెలసిన ఎక్సైజ్ అధికారులు ఏం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మద్యం దందా ఎక్సైజ్ అధికారుల కనుసంధానంలోనే నడుస్తున్న ఏం తెలియనట్లు వ్యవహరిస్తున్నారని కొందరు అభిప్రాయడుతున్నారు. ఎక్సైజ్ ఎస్సై నుంచి సూపరింటెడెంట్ దాక ఒక్కొక్కరికి ఒక రేటు ఉంటుందని, వారికి ముట్టాల్సినవి ముట్ట చెప్పాల్సిందేనని వినికిడి.

**ఒక్కొక్క గ్రామంలో పదికి పైగానే...**

అబ్కారీశాఖ అధికారుల అండదండలతో రెచ్చిపోతున్న మద్యం వ్యాపారులు జిల్లాలోని అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపుల దందా జోరుగానే కొనసాగిస్తున్నారు. పల్లెలు, మారుమూల గ్రామాలు అని తేడా లేకుండా రాత్రింబవళ్లు మత్తులో తూలుతూ మందుబాబులు జేబులు కాలి చేసుకుంటున్నారని చెప్పవచ్చు. ఒక్కొక్క గ్రామానికి 10 బెల్ట్ షాపులకు పైగానే ఏర్పాటు చేసుకుని, మంచినీళ్లు దొరకని షాపులు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు గానీ, మద్యం దొరకని చోటంటూ లేకపోవడం గమనార్హం, నివాస గృహాలు, చిన్న చిన్న కిరాణా షాపుల్లోనూ కావలసినంత మద్యం దొరుకుతోంది. వైన్, బార్ షాపుల్లో సమయసారిణి ప్రకారం మద్యం లభ్యమవుతుండగా బెల్టు షాపుల్లో మాత్రం 24 గంటలు అందుబాటులో ఉంటోంది. సామాన్యులు పొద్దంతా పని చేసి సంపాదించిన సొమ్మును మద్యానికి వెచ్చిస్తూ కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. అనధికారిక టెండర్ ప్రక్రియలో భాగంగా గ్రామాల్లో బహిరంగంగా మద్యం అమ్మకాలకు స్థానికంగా హక్కుల దక్కించుకుంటున్నాయి.

**హోటల్లోనూ దర్జాగా..**

జిల్లా కేంద్రంతో పాటు రహదారుల పొడవున హోటల్లు కిరాణా షాపుల్లోనూ దర్జాగా మద్యం విక్రాలు కొనసాగుతున్నాయి. ప్రత్యేకంగా జిల్లా కేంద్రంలో పేరుకే భోజనం హోటల్లు లోపలికి వెళ్తే మొత్తం మందు సిట్టింగులు కేవలం మందు సెట్టింగ్ కోసమే హోటలను ఏర్పరచుకున్నట్టుగా కనిపిస్తుంది. అన్ని తెలిసిన అధికారులు తూ తూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా వైన్ షాపుల నుంచి ఎమ్మార్పీ ధరలకు బెల్టు షాపు నిర్వాహకులు కొనుగోలు చేసి ఒక క్వార్టర్ బాటిల్ పై 20 ,ఆఫ్ బాటిల్ పై 40, ఫుల్ పై 80, బీరుపై 30 రూపాయల వరకు అదనంగా తీసుకుంటున్నారు. మద్యం ప్రియులు చేసేది ఏమీ లేక దోపిడీకి గురవుతున్నారు. మద్యం షాపు నిర్వాహకులు, అధికారుల మధ్య ఒప్పందంలో ఈ దందా కొనసాగుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి మద్యం దందాను అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.

**జిల్లాలో బెల్టు షాపులే లేవు**

జిల్లాలో ఎన్ని బెల్టు షాపులు ఉన్నాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ను వివరణ కోరగా నిత్యం మా శాఖ దాడులు నిర్వహిస్తుంది. జిల్లాలో ఎక్కడ కూడా బెల్ట్ షాపులు లేవు అని, మండలాల బెల్టు షాపుల వివరాలు కావాలంటే సదరు మండలాల ఎస్సైలను అడిగి తెలుసుకోవాలని సమాధానం ఇచ్చారు.

## దిష్టిబొమ్మలా తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణ బోర్డు

**- రు.4.16ల అంచనాతో**

**2023లో నాటి పాలకుల ఏర్పాటు**




దిష్టి బొమ్మను తలపిస్తున్న కొత్తమొల్గర తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణ బోర్డు

**భూత్పూర్,ఫిబ్రవరి 9,ప్రభాతవార్త :** గ్రామీణ క్రీడల్ని ప్రోత్సాహించేందుకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణ బోర్డులు దిష్టిబొమ్మల్ని తలపిస్తున్నాయి. భూత్పూర్ మండలం కొత్తమొల్గర క్రీడా మైదానాన్ని రు.4.16లక్షల అంచనావ్యయంతో గ్రామానికి కిలోమీటరు దూరంలో ఏర్పాటు చేశారు. ఇది ఎందుకు పనికి రాకుండా నిరుపయోగంగా పడిఉంది. 2023లో ఎన్నికలు జరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం మారి ఇదే సంవత్సరం డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అధికారాన్ని చేపట్టింది. దీంతో గ్రామీణ క్రీడా మైదానాలు నిరుపయోగంగా పడి ఉన్నాయనే చెప్పాలి. భూత్పూర్-నాగర్‌కర్నూల్ రోడ్డుపై కొత్తమొల్గర గ్రామానికి సంబంధించి తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాన్ని కొత్తమొల్గరకు కిలో మీటరు దూరంలో నాగర్‌కర్నూల్ హైవేపై ఏర్పాటు చేశారు. క్రీడా ప్రాంగణాన్ని పట్టించుకునే నాథుడే లేక ముళ్లకంపలు, గుబురు పొదల మధ్య కొత్తమొల్గర తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణ బోర్డు వచ్చిపోయే వారికి దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. ఇప్పటికైనా రాష్ట్రంలో కాంగ్రెస్ కొత్త ప్రభుత్వమైనా గ్రామీణ క్రీడా మైదానాలు, ప్రాంగణాల్ని మెరుగుపరిచి గ్రామాల్లో యువతను ప్రోత్సాహించేందుకు తోడ్పాటునివ్వాలని స్థానికులతో పాటు గ్రామీణ యువత కోరుతోంది.

# గ్రామాల అభివృద్ధి తోనే దేశాభివృద్ధి సాధ్యం

**18.71 కోట్ల నిధులతో**

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

**ఆరు గ్యారంటీలు సహా, గ్రామాలలో మౌళిక వసతుల కల్పన పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి**

**అబ్కారి, పర్యాటక, సంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి**



అమ్మపల్లి గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు ,ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



హలో అభివృద్ధి కార్యక్రమాలకు విచ్చేసిన మంత్రి జూపల్లినీ ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** గ్రామాల అభివృద్ధి తోనే దేశాభివృద్ధి సాధ్యం అని, గ్రామాలలో మౌళిక వసతుల కల్పన పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని అబ్కారి, పర్యాటక, సంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వనపర్తి నియోజకవర్గం పెద్దమందడి మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి తో కలిసి రూ. 18.71 కోట్ల నిధులతో బీటీ, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు సహా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలు, గ్యారెంటీల అమలుతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తుందని, గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యం, రోడ్డు రవాణా సౌకర్యాలను మెరుగుపర్చడం ద్వారా జీవన ప్రమాణాలు సుస్థిరమవుతాయన్నారు. ఎమ్మెల్యే మేఘరెడ్డి వీరాయ పల్లి గ్రామంలో మాట్లాడుతూ వచ్చే డిసెంబర్ చివరికల్లా ఒక్క పెండింగ్ పనులు లేకుండా అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఇళ్లులేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ళు, రేషన్ కార్డులు మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. ముందుగా, పెద్దమందడి మండల పరిధిలోని చిలకటోని పల్లి గ్రామంలో రూ.9.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సైడ్ డ్రైనేజీ పనులకు శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి శంఖుస్థాపన చేశారు. అనంతరం వెల్టూర్ గ్రామ పంచాయతీలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రెయిన్ పనులకు శంఖుస్థాపన చేశారు. గట్ల ఖానాపూర్ లో రూ. 3.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అల్వాల్ మంగంపల్లి బి.టి రోడ్డు, రూ.10 లక్షల వ్యయంతో డ్రైన్ నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. రూ. 4.50 కోట్ల అంచనా వ్యయంతో అమ్మ పల్లి నుండి పెద్దమందడి వయా సోలార్ ప్లాంట్ వరకు వేయనున్న బి.టి. రోడ్డు పనులకు, గ్రామంలో రూ. 10 లక్షలతో సీసీ రోడ్ పనులకు ఆబ్కారీ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్థానిక శాసన సభ్యులతో కలసి శంఖుస్థాపన చేశారు. మదిగట్ల గ్రామ పంచాయతీలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న సి.సి రోడ్డు కు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మేఘరెడ్డి శంఖుస్థాపన చేశారు. అనంతరం, మొజర్ల గ్రామ పంచాయతీలో మంత్రి జూపల్లి, తూడి మేఘా రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి, మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. మోజర్ల గ్రామంలో రామలింగేశ్వర స్వామి దేవాలయంలో రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించిన కామన్ సెంటర్ ను ప్రారంభోత్సవం -మిగతా3లో..

# ఆరు నెలలుగా కంకర రోడ్డే దిక్కు..

- నరకయాతన అనుభవిస్తున్న వాహనదారులు
- వెర్కో కంపెనీ వరకు రోడ్డ వేసి వదిలేసిన వైనం
- దుమ్ము,ధూళికి వాహనదారుల ఇబ్బందులు
- ఎమ్మెల్యేగారు మా సమస్య ఆలకించండంటూ వేడుకోలు



దుమ్ములేస్తున్న రోడ్డు

**జడ్చర్ల, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త ;**ఉదండాపూర్ ప్రాజెక్టు బీటీ రోడ్డుకు మోక్షం ఎప్పుడో అంటూ ఆయా గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాదిగా రాకపోకలు సాగించే వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సగం రోడ్డు వేసి సగం వదిలేశారని ఆరు నెలలుగా కంకంర రోడ్డుతో నానా అవస్థలు పడుతున్నామని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కావేరమ్మ పేట నుంచి ఉదండాపూర్ ప్రాజెక్టు వరకు గత ప్రభుత్వంలోనే బీటీ రోడ్డు మంజూరైంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక పెద్దపల్లి సమీపంలోని వెర్కో కంపెనీ వరకు మాత్రం రోడ్డు వేసి మిగతా కంకర పోసి అలాగే వదిలేశారు. సుమారు ఆరు నెలలు గడుస్తున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు అటు వైపు కూడా చూడడం లేదని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే కేవలం కమీషన్ల కోసం వెర్కో కంపెనీ వరకు రోడ్డు వేసి మిగతా పని వదిలేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆర్అండ్‌బీ ఏఈకి వినతి ఇచ్చినా ఫలితం లేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సారూ మీరైన స్పందించి రోడ్డు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

**అటు వేపూ చూడని ఆర్అండ్ బీ అధికారులు..**

బీటీ వేసే వరకు ఉదయం సాయంత్రం రెండు సార్లు నీళ్ల పట్టాలని నిబంధన ఉన్నా ఆర్అండ్ బీ అధికారులు పట్టించుకోవడం లేదు. రోజుల తరబడి దుమ్ము, ధూళితో శ్వాసకోశవ్యాధులు వస్తున్నాయని వాహనదారులు చెబుతున్నారు. చాలాసార్లు కిందపడడంతో తీవ్ర గాయాలైన సంఘటనలు ఉన్నాయి. అయిన సంఘటనలు ఉన్నాయి. ప్రాజెక్టు టిప్పర్లు నడవడంతో రోడ్డు గుంతల మయంగా తయారైంది. నిత్యం ప్రాజెక్టు పనులు నిమిత్తం టిప్పర్ల ధుమ్ముకు రోడ్డు కూడా కనిపించనంత పరిస్థితి ఉందని చెబుతున్నారు. కావేరమ్మ పేట ఆర్అండ్‌బీ ఓల్డ్ బంగ్లా నుంచి జయప్రకాశ్‌నగర్, బండమీదిపల్లి, చిన్నపల్లి, పెద్దపల్లి, వల్లూరు మీదుగా ఉదండాపూర్ వరకు వందలాదిగా వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు.



కంకర వేసి వదిలేసిన దృశ్యం

**దుమ్ముతో రోగాలు వస్తున్నాయి..**



మేము నిత్యం జడ్చర్ల, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాం. దుమ్ము ధూళితో నరకం అనుభవిస్తున్నాం. బైక్ పై వెళ్తుంటే రోడ్డు కూడా కనిపించనంత దుమ్ము వస్తుంది. కంపెనీ పనులు నడుస్తున్నాయని కాబట్టి వెర్కో కంపెనీ వరకు రోడ్డు వేసి అవుతల వేయడం లేదు. ఇదేం న్యాయం. ఆర్ అండ్ బీ ఏఈ, అధికారులకు వినతి ఇచ్చానా పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్యే గారు స్పందించి మా రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలి.

**– అక్బర్ పాషా, యువకుడు,ఉదండాపూర్**

**కిందపడి గాయాలపాలయ్యాం.,**



ఉదండపూర్ రోడ్డు వెంట చాలా సార్లు మా గ్రామస్తులు కింద పడి గాయాలపాలయ్యారు. దుమ్ముతో చాలా ఇబ్బందులుఎదుర్కొంటున్నాం. దుమ్ము లేవకుండా కనీసం నీళ్లు కూడా పట్టడం లేదు. కమీషన్ల కోసం కంపెనీ వరకు రోడ్డువేసి అవుతల మాత్రం అలాగే వదిలేశారు. ఒకే రోడ్డు సగం సగం పనులు ఎలా చేస్తారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి. మా బాధలు అర్థం చేసుకోవాలి.

**– మంగలి రాఘవేందర్, వల్లూరు,ఉదండాపూర్**

## నేడు ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తెలుగుసత్తయ్య, నాయకులు

**జడ్చర్ల, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** పంటలకు గిట్టుబాటు ధరలను చట్టబద్ధం చేయాలని, రైతుల ఆత్మహత్యలను నివారించడానికి రుణ విమోచన చట్టం, ఉపాధి హామీకి రెండు లక్షల కోట్లు కేటాయించాలి, భీమా రంగంలో 100 ఎఫ్‌డిఐలను ఎత్తివేయాలి, విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించరాదని పలు డి మాండ్లలో సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్య దర్శి తెలుగు సత్తయ్య అన్నారు. జడ్చర్ల వ్యవసాయ మార్కెట్లో ఆదివారం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనాల పెంపుదల 26,000 ఇచ్చే విధంగా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అమలు చేయాలి, నాలుగు లేబర్ కోర్సును రద్దు చేయాలి ,8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై అఖిలపక్షాన్ని పిలిచి చర్చించాలని డిమాండ్ చేశారు. 6గ్యారంటీల అమలు అభివృద్ధి సంక్షేమ పథకాలను తగిన విధంగా బడ్జెట్ కేటాయింపులు చేపట్టాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట ఐక్యవేదిక డిమాండ్ చేస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో యాదమ్మ, ఆంజనేయులు, శేఖర్,లక్ష్మీదేవి, అలివేల, నరసమ్మ, శ్రీనివాస్ ,కుమార్, పరశురాం ,మల్లేష్ ,నాగ సాయిలు ,తదితరులు పాల్గొన్నారు.

## పాత ఎంపీడీవో కార్యాలయంలో అగ్ని ప్రమాదం

**మంటల్లో దగ్ధమైన పాత దస్త్రాలు ..**

**మంటలు ఆర్పుతుండగా బయటపడ్డ శవం**



బిజినేపల్లిలో ఎగిసిపడుతున్న మంటలు (ఇన్‌సెట్లో) మంటల్లో కాలి బూడిదైన శవం



**బిజినేపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని పాత ఎంపీడీవో కార్యాలయం (ఒకప్పటి బ్లాక్ కార్యాలయం) లో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సాయంత్రం వేళ నిప్పు అంటుకొని పాత భవనం లోపలి నుండి పెద్ద ఎత్తున మంటలు చెలరేగడాన్ని అటుగా వెళ్ళిన స్థానికులు గమనించి పోలీసులకు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఎస్ఐ కె.శ్రీనివాస్ సమాచారంతో అగ్నిమాపక - మిగతా3లో..

## రాజావళి ఉర్సు ఉత్సవాల ఫ్లెక్సీ గోడపత్రికల విడుదల



ఆయూబ్ ఖాన్ ఆధ్వర్యంలో రాజావళి ఉర్సు ఉత్సవాల ఫ్లెక్సీ గోడపత్రికల విడుదల

**అమరచింత, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** ఈ నెల 14 నుంచి మూడు రోజులపాటు జరిగే హజరత్ సయ్యద్ షా రాజావలి దర్గా 414 వ ఉర్సు ఉత్సవాల ఫ్లెక్సీ, వాల్ పోస్టర్లను అమరచింత ముస్లిం కమిటీ అధ్యక్షుడు ఆ యుబ్‌ఖాన్ ఆధ్వర్యంలో దర్గా కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 వ తేదీ శుక్రవారం రాత్రి వేండి దర్గాతో గందోత్సవం, 15వ తేదీ శనివారం ఉర్సు ఉత్సవాలు, చాదర్ ఊరేగింపు, హైదరాబాద్ వారిచే కవ్వాలి, 16 తేది ఆదివారం భారత్ ఫాతిహా, షాద్‌నగర్ వాస్తవ్యులు ఖాదర్ గోరి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని కావున కులమతాల కతీతంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతి ఏడాది మాదిరిగా ఈ సారి కూడా రాజావలి దర్గా ఉర్సు ఉత్సవాలను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ నిర్వాహకులు ఖాజా హుస్సేన్, రఫీ, కాసిం, మోహిన్, ఖదీర్, తౌఫిక్, షేక్ పాషా, అశ్వక్, దిలీప్, ఇంతియాజ్, సుల్తాన్, పోసిరి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలను కొనసాగిద్దాం



మాస్ లైన్ ఆధ్వర్యంలో యాదగిరి సంస్మరణ సభ

**అమరచింత, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** దోపిడి, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడిన అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలను కొనసాగించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ వనపర్తి జిల్లా కార్యదర్శి, హనుమంతు అన్నారు. ఆదివారం అమరచింత మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో సిపిఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ యాదగిరి సంస్మరణ సభ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. అనంతరం జరిగిన సభలో హనుమంతు మాట్లాడుతూ, కామ్రేడ్ యాదగిరిరాష్ట్రంలో కులవివక్షకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసి గ్రామీణ ప్రాంతాల ప్రజలను ఐక్యం చేసి కమ్యూనిస్టు పార్టీలకు అండగా నిలిపారని ఆయన అన్నారు. నేటి యువత కామ్రేడ్‌యాదగిరిని ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రసాద్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి బోయిన్పల్లి గణేష్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి కె రాజన్న, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు కురుమన్న ఆశన్న, భక్తి జిలాని, రమేష్ , మురళి, మనీ వర్ధన్ , ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

## భట్టుపల్లిలో శరవేగంగా అండర్ డ్రైనేజీ పనులు

**పనులను పరిశీలించిన మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు భూపతిరెడ్డి**



అండర్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న భూపతిరెడ్డి

**భూత్పూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం భట్టుపల్లి గ్రామంలో ఇంటర్నల్ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులు శరవేగంగా జరుగు తున్నాయి. ఇందులో భాగంగా ఎస్సీ కాలనీలో ఈ పనులను ఆదివారం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి ఇతర కాంగ్రెస్ నాయకులు పరిశీంచారు. ఎమ్మెల్యే జి మధుసూధన రెడ్డి(జీఎంఆర్) చొరవతో భట్లుపల్లి గ్రామానికి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు రు.7లక్షలు మంజూరయ్యాయని, ఇందులో రు.3లక్షలు అండర్ డ్రైనేజీలకు, రు.4లక్షలు ఇంటర్నల్ రోడ్ల నిర్మాణ పనులకు వెచ్చిస్తున్నట్లు రేకులపాటి భూపతిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులతో పాటు గ్రామస్తులు రఘుపతిరెడ్డి, సుధీర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌గౌడ్, అనంతరెడ్డి, కుర్మయ్య, వడ్డె రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. తమ గ్రామానికి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్)కు సహకరించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలకు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డితో పాటు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కర్ని మండల ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యం




వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**మక్తల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గంలో అన్ని అర్హతలు గల కర్ని గ్రామం కేంద్రంగా నూతన మండలం ఏర్పాటు చేస్తేనే మారుమూల పల్లెల అభివృద్ధి సాధ్యమవుతుందని కర్ని మండల సాధన సమితి నాయకులు పేర్కొన్నారు. కర్ని మండల సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం మక్తల్ మండలంలోని చిట్యాల, మాగనూరు మండలంలోని మందిపల్లి, గజరందొడ్డి, పర్మన్‌దొడ్డి గ్రామాల్లో కర్ని మండలం ఏర్పాటుకు ప్రజల మద్దతు కోరుతూ ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 గ్రామాల ప్రజలు తమ పూర్తి మద్దతును తెలపడం జరిగిందన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లోని ప్రజలు కర్ని మండలం కోసం కలిసికట్టుగా ముందుకు సాగుతామని తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరితో పాటు జిల్లా కలెక్టర్, పలువురు మంత్రుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. త్వరలోనే అన్ని గ్రామాల ప్రజలు, యువత, మేధావి వర్గంతో కలిసి మండలం ఏర్పాటు అయ్యే వరకు పోరాడుతామని అన్నారు. ఆయా సమావేశాల్లో గ్రామాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

## లోక కళ్యాణార్థం శ్రీ చండీ హోమం

**పూజలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**కొత్తకోట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** కొత్తకోట పట్టణం లో శ్రీ భవాని శంకర ఆలయం లో శనివారం నుంచి నేటి వరకు ధ్వజస్థంభ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. అందులో భాగంగా రెండవ రోజు అమ్మవారి ఆలయంలో లోక కళ్యాణార్థం అమ్మవారి భక్తులందరూ సుఖ శాంతులతో ఉండాలని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ సారంగదర కోటేశ్వర స్వామి వారు భక్తులచేత శ్రీ చండీ హోమం నిర్వహించారు. ప్రతిష్ఠ కొరకు ఏర్పాటు చేసిన ధ్వజస్థంభాలకు, నవగ్రహ విగ్రహాలకు ధాన్యాధివాసం చేశారు. పాల్గొన్న స్థానిక శాసన సభ్యులు జి. మధుసూధన్ రెడ్డి ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన మధుసూదన్ రెడ్డిని ఆలయ నిర్వాహకులు పొగాకు రాఘవేంద్ర ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చనకు మఠం ఆనందయ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆహ్వానించారు. తండోప తండాలుగా వస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా క్రమ పద్దతిలో భక్తులను అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం భక్తులందరికీ కూడా ఆలయ నిర్వాహకులు పొగాకు మహేష్ బాబు సోదరులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతాప్ కౌటిళ్యకు అబ్దుల్ కలాం జాతీయ అవార్డు



విశాఖపట్నంలోని సెంట్రల్ లైబ్రరీలో అవార్డు అందుకుంటున్న డా. ప్రతాప్ కౌటిళ్యా

**బిజినేపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డును సాహితీవేత్త డా. ప్రతాప్ కౌటిళ్య అందుకున్నట్లు ఆదివారం తెలిపారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి డా. చిన్నారావు వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించే ఈ అవార్డును ప్రతాప్ కౌటిల్యకు సైన్స్‌లో చేసిన కృషిని గుర్తించి ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డు ప్రశంస పత్రం, మెమెంటో అందజేసి ప్రొత్సహిస్తున్నట్లు వివరించారు. వరుసగా రెండో ఏడాది కూడా ఈ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని, అవార్డు ఇచ్చి సత్కరించిన నిర్వహకులు డా. దోమన చిన్నారావు, డా.అలపాటిలకు కృతజ్ఞతలు తెలిపారు. పాపులర్ సైన్స్‌లో ఆయన చేసిన రచనలు ఎంతో ఆలోచనలను రేకెత్తించేవిగా, నూతన ఆవిష్కరణలకు మార్గదర్శంగా, రాబోయే కొత్త తరాల శాస్త్రవేత్తలకు ఈయన సైన్స్ ఫిక్షన్ రచనలు ఎంతో ఉపయోగపడుతాయని మల్టీ జోనల్ ఉన్నత విద్యా జాయింట్ డైరెక్టర్ డీఎస్ఆర్ రాజేంద్ర సింగ్ కొనియాడారు. భవిష్యతుల్లో సైన్స్‌లో మానవాళికి ఉపయోగపడే ఎన్నో రచనలు ఆవిష్కరణ చేయాలని కోరారు. సైన్స్, సాహిత్యంలో రెండు దశాబ్దాలుగా వివిధ రచనల ద్వారా సైన్స్‌లోని నిగూఢ అంశాలను విశ్లేషణాత్మకంగా పరిశోధిస్తున్నందుకు జాతీయ స్థాయి ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు అందుకున్న ప్రతాప్ కౌటిళ్యను ఉపాధ్యాయులు సునీత, ఎస్వీ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, గ్రామస్తులు అభినందించారు.

# స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలుపొందాలి

**కొత్తకోట మండలంలో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభం , హాజరైన దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**



అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే

**కొత్తకోట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను మనమే కైవసం చేసుకోవాలని ఆ దిశగా ప్రతి ఒక్కరు పని చేయాలనీ దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తకోట మండలంలోని ఆయా గ్రామాలలో నిర్మించిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా మదనాపురం మండలం అగ్రహారం (గోవిందహళ్లి) గ్రామంలో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్ ను ప్రారంభించారు. అనంతరం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని అంబా భవాని మాత దేవాలయంలో జరుగుతున్న పూజ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా కొత్తకోట మండలం రాయిని పేట గ్రామం నుండి తాండకు వేసిన నూతన బీటీ రోడ్డును ప్రారంభించి, అనంతరం ఇండియన్ ఐ ఎన్ ఏ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఏ తర్వాత అమడబాకుల గ్రామంలో ఉన్న మోడల్ స్కూల్ లో డైనింగ్ హాల్, ప్రహరి గోడ, డ్రింకింగ్ వాటర్, మేయింటెన్సన్ తదితర అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. పాలెం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత హైస్కూల్లో నూతన లైబ్రరీని, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిర్వహిస్తున్న భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, సి డి సి చైర్మన్ గొల్ల బాబు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులు కృష్ణారెడ్డి, బోయోజ్, సీనియర్ నాయకులు రావుల కర్ణాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచుపల్లి, పట్టణ అధ్యక్షుడు మేస్త్రి శ్రీను, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి వేముల శ్రీనివాస్ రెడ్డి, మిషేక్, సుభాష్, అమ్మపల్లి బాలకృష్ణ, ఆమడబాకుల మన్యం, పాలెం బాలరాజ్, ముస్తఫా, బాలరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల సాధనలో పిఆర్‌టియు టిఎస్ గొప్ప పాత్ర

**- పిఆర్‌టియు టిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్ రెడ్డి - అట్టహాసంగా పిఆర్‌టియు ఆవిర్భావ దినోత్సవం**




ఆవిర్భావ వేడుకల్లో పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ సమస్యల సాధన లో పిఆర్‌టియు టిఎస్ గొప్ప పాత్ర పోషిస్తుందని పిఆర్‌టియు టిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్ రెడ్డి అన్నారు. పిఆర్‌టియు టిఎస్ 53వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం మహబూబ్‌నగర్‌లోని పిఆర్‌టియు భవన్‌లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం భవన్ వద్ద జిల్లా గౌరవ అధ్యక్షుడు వి.బుచ్చా రెడ్డితో కలిసి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి పిఆర్ టియు పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు పటిష్టతకు, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రతి ఒక్కరం పాటు పడుతామంటూ మండల, జిల్లా, రాష్ట్ర నాయకులు ముక్త కంఠంతో ప్రతిజ్ఞ చేశారు. గండీడ్, మహ్మదాబాద్ మండల శాఖల సహకారంతో నూతంగా ఉద్యోగాల్లో చేరిన ఉపాధ్యాయులకు సర్వీసు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. పీఆర్టీయు సంఘ సభ్యులుగా సంఘానికి విశేష సేవలు అందించిన మాజీ అధ్యక్షులు గట్టు వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు శంకరయ్య, జి.రాములు, ఆంజనేయులు బి. అశోక్ కుమార్‌రెడ్డి యం. లక్ష్మీ, వెంకట్ రెడ్డి, సునంద కె నరసింహ రెడ్డిలను పీఆర్టీయూ మహబూబ్ నగర్ జిల్లా సంఘ పక్షాన ఘనంగా సన్మానించారు. పిఆర్‌టియు పోరాట ఫలితంగానే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమవుతాయని ఆ యునియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వి.బచ్చారెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి అనేక జిఓలు సాధించిన సంఘంగా పిఆర్‌టియు గుర్తింపు పొందిందన్నారు. సమస్యల సాధన యే ప్రధాన ఆశయంగా పిఆర్‌టియు పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో నారాయణపేట జిల్లా మాజీ అధ్యక్షుడు తిమ్మారెడ్డి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం రెడ్డి, మాజీ జిల్లా గౌరవ అధ్యక్షుడు గోపాల్ నాయక్, అత్తర్ అహ్మద్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, అశ్విని చంద్రశేఖర్, ఎల్లయ్య, పురుషోత్థమ్ గౌడ్, కవితా రెడ్డి వై.వి.రావ్, వెంకట్ రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా బాధ్యులు, సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

## స్థలాలు చూపకుంటే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం



రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అజయ్

**అమరచింత, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** పట్టాలు పొందిన లబ్ధిదారులకు ప్రభుత్వం స్థలాలు చూపకుంటే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవు తామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ అజయ్ అన్నారు. పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థలాలు చూపాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రెండవ రోజు జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతు ప్రకటించారు. ఈ సంద ర్భంగా అజయ్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఇండ్లు లేని పేదలకు పట్టాలి ఇచ్చి అనేక ఏండ్లు గడుస్తున్న ఇప్పటివరకు స్థలాలు చూపడం లేదని అధికారులకు, ప్రజాప్రతినిధులకు అనేకమార్లు వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ప్లాట్లు లేని వారికి ప్రభుత్వం ప్లాట్లు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని వాగ్దానం చేసిన ఇప్పటివరకు అమలు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యం లో ఇండ్లు లేని పేదలకు దుంపై కుంట ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని నివాసముంటున్న గుడిసేవాసులకు అధికారులు విద్యుత్తు, రోడ్లు, డ్రైనేజీలు, త్రాగునీరు కల్పించకపోవడం అన్యాయమని ఆయన అన్నారు. మఖ్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి అర్హులైన పేదలకు న్యా యం చేయాలని అనేకమార్లు వినతి పత్రాలు ఇచ్చిన స్పందించకపోవడం విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేదలకు న్యాయం చేయకుంటే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షలకు సిద్ధమవుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జిఎస్ గోపి, సిపిఎం జిల్లా నాయకులు బి వెంకటేష్, ఆర్ఎన్ రమేష్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు శ్యాంసుందర్, డివైఎఫ్ఐ నాయకులు చంటి, రాఘవేంద్ర, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై సన్నాహక సమావేశం



కానాయపల్లి బిఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షులు వామన్ గౌడ్

**కొత్తకోట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** దేవరకద్ర నియోజకవర్గంలోని కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామంలో ఆదివారం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్ర శేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలపై గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తకోట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వామన్ గౌడ్, మాజీ ఎంపీపీ గుంత మౌనిక, మాజీ సీడీసీ చైర్మన్ చెన్నకేశవ రెడ్డిలు హాజరయ్యారు. వచ్చే ఎన్నికల్లో రిజర్వేషన్ బట్టి అభ్యర్థులను ఎన్నుకోవాలని చర్చించారు. అందరి సమక్షంలో బిఆర్ఎస్ కార్యకర్తల అభిప్రాయ మేరకు మన పార్టీ నుండి ఒక్కరిని మాత్రమే అభ్యర్థిని ఎంపిక చేసుకొని గెలుపు కొరకు కష్టపడి పని చేయాలనీ మండల నాయకులు సలహాలు సూచనలు చేశారు. కానాయపల్లి గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ గెలిపించుకుంటే మాజీ ఎమ్మెల్యేలు ఆలన్న, రావుల పేర్లు నిలబెట్టిన వారు అవుతారని ఏ దిశగా ప్రతి కార్యకర్త పని చేయాలనీ పిలుపునిచ్చారు. అదేవిధంగా కనిమెట్ట గ్రామంలో కూడా బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు హోటల్ రాజు, మాజీ వైస్ ఎంపీపీ వడ్డే శ్రీనివాసులు, నరోత్తమ్ రెడ్డి, రావుల గోపాల్ రెడ్డి, రఘువర్ధన్ రెడ్డి, రమేష్ రెడ్డి, భాస్కర చారీ, యాటకిరీ అంజన్న, వెంకటేష్ సాగర్, బక్క గోవర్ధన్, రావుల మురళీధర్ రెడ్డి, భరత్ రెడ్డి, బాజ గిరన్న, సాయిలు, మురళి, కుర్మయ్య, రవీందర్ గౌడ్, వడ్డే రాములు, వాకిటి నర్సింహా, రాసమోని శ్రీనివాసులు, మొగులయ్య, నక్కల చిన్న నర్సింహా, యాటకిరీ శ్రీరాములు, బాబు, జండిగి రాజు, డీకే లక్ష్మయ్య, నాగన్న, కొత్త నర్సింహా, లంబాడి అంజన్న, లంబాడి బాలయ్య, మహేందర్, కురుమూర్తి, గంగాధర్, బాలయ్య, బక్క లక్ష్మయ్య, రాజు, విజయ్, దస్తగిరి, కృష్ణయ్య, శేఖర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పిఆర్‌టియు-టిఎస్ సంఘ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



జెండా ఆవిష్కరణ చేస్తున్న జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి

**వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** వనపర్తి పిఆర్‌టియు-టిఎస్ సంఘ 53వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను టిఆర్‌టియు సంఘం ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం జిల్లా పిఆర్‌టియు టిఎస్ కార్యాలయంలో పిఆర్‌టియు-టిఎస్ జెండాను జిల్లా అధ్యక్షులు మేరెడ్డి బౌద్ధారెడ్డి, ప్రధాన కార్యదర్శి సూర చంద్రశేఖర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ వ్యవస్థాపకులైన దివంగత సామల యాదగిరి పుట్టినరోజు ను పిఆర్‌టియు-టిఎస్ సంఘ ఆవిర్భావ దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. అనంతరం సామల యాదగిరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఉపాధ్యాయులకు సాధించి పెట్టిన జిఓ లు, సంఘ అభివృద్ధి గురించి వివరించారు. గతం సంఘ అభివృద్ధిలో పాలు పంచుకున్నటువంటి మాజీ పిఆర్‌టియు బాధ్యులు, విశ్రాంత ఉపాధ్యాయులు శేఖర్, ఎస్. సత్యనారాయణ, వెంకట్రాంరెడ్డి, శేఖర్, శివారెడ్డి శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు-టిఎస్ జిల్లా అధ్యక్షుడు కొంకల శివకుమార్, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా బాధ్యులు, సంఘ శ్రేయోభిలాషులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మృతుడు గణేష్ కుటుంబానికి స్నేహితుల భరోసా..



మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామానికి చెందిన శ్యాంపూరి గణేష్ కుటుంబానికి తనతో పాటు చదువుకున్న స్నేహితులు భరోసాగా నిలిచారు. తనతో పాటు వంగూరు మండల కేంద్రంలో 10వ తరగతి చదివిన తోటి స్నేహితులు తమ వంతుగా రూ.1.57 లక్షలు, ఇంటర్మీడియట్ స్నేహితులు రూ.17,500 వేలు, పీజీ స్నేహితులు రూ.30 వేలు, అలాగే తాండ్ర గ్రామ స్నేహితులు రూ.1.20 లక్షలు సమకూర్చి ఆదివారం కొట్ర గ్రామంలోని గణేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని గణేష్ భార్య శివలీలకు అందజేశారు. తమ విద్యా వ్యాసంలో తమతో పాటు చదువుకున్న గణేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరమని, గణేష్ కుటుంబానికి స్నేహితులుగా మేము ఎల్లవేళలా అండగా ఉంటామంటూ గణేష్ కుటుంబానికి వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గణేష్ స్నేహితులు పాల్గొన్నారు.

## 30 ఏళ్ల అపూర్వ కలయిక



కొకుంట్ల ఉన్నత పాఠశాల 1994,95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి9 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్లో కొకుంట్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు 1994, 1995 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 30 సంవత్సరాల కిందట తాము చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకొని బాల్యంలో తాము చదువుకున్న పాఠశాలలో తీపి గుర్తులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఎవరెవరు ఏ ఏ రంగాలలో స్థిరపడ్డారు ఒకరినొకరు తెలియ జేసుకున్నారు. అందకు ముందు సరస్వతి దేవి చిత్రపటానికి పూజలు చేసి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వర్గస్తులైన గురువులు, తోటి మిత్రులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## వాస్తుపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**భూత్పూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపాలిటీ మూడో వార్డు గోప్లాపూర్‌లో నూతనంగా నిర్మించిన టీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు నారాయణయాదవ్ గృహప్రవేశ వాస్తుపూజా కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ ప్రత్యేక పూజలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఇతర బీఆర్ఎస్ నాయకులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూము శ్రీనివాస్‌రెడ్డి, టి మురళిధర్‌గౌడ్, సత్తూర్ నారాయణగౌడ్, మేకల సత్యనారాయణ, సత్తూర్ అశోక్‌గౌడ్, టీచర్ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణ దేవాలయానికి 5 లక్షల విరాళాలు



5 లక్షలు విరాళంగా అందజేస్తున్న జీవన్ రెడ్డి

**కొత్తకోట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** కొత్తకోట మండల కేంద్ర సమీపల గల నూతన శ్రీ కృష్ణ ఆలయంలో శ్రీ కృష్ణ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యులు మన్నే జీవన్ రెడ్డి 5 లక్షల రూపాయలు విరాళాలతో పాటు రెండు గోవులను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీ కృష్ణ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాపాయ్య కృష్ణారెడ్డి, జిల్లా గొర్రెల సహకార సంఘం మాజీ చైర్మన్ కురుమూర్తి యాదవ్, చిన్న తిమ్మన్న యాదవ్, సత్యం యాదవ్, హనుమంతు యాదవ్, సీనియర్ జర్నలిస్ట్ నాకొండ యాదవ్, శంకర్ యాదవ్, అద్వానీ శ్రీను, పెంటన్న యాదవ్, రామకృష్ణ యాదవ్, బాలరాజు యాదవ్, కదిరే సాయిల్ యాదవ్, నాగన్న యాదవ్, కదిరే శ్రీనివాసులు, భాస్కర్ యాదవ్, మురళి యాదవ్, ఆటో రామ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పై భవానయ్యకు ఘన సన్మానం

**భూత్పూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** నారాయణపేటలో ఎఎస్పైగా సమర్థవంతంగా విధులు నిర్వర్తించి నాగర్‌కర్నూల్ ఎస్పైగా పదోన్నతి పొందిన భూత్పూర్ పట్టణం పదోవార్డుకు చెందిన గడ్డమీది భవానయ్యను ఆదివారం స్థానిక వివేకానంద పాఠశాలలో పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నర్సింహులుతో పాటు కాంగ్రెస్ నాయకుడు బోరింగ్ నర్సింహులు, మండల గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తూర్ కృష్ణయ్యగౌడ్ పాల్గొన్నారు.

## పశువుల సంతకై స్థల పరిశీలన



**మక్తల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణ సమీపంలోని కాటన్ మిల్లు వద్ద పశువుల సంత నిర్వహణపై ఆదివారం మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి స్థల పరిశీలన చేశారు. ప్రస్తుతం పశువుల సంత నిర్వహిస్తున్న స్థలం పట్టణ నడిబొడ్డున ఉన్నందున రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణ శివారులో సంగం బండ కెనాల్ వద్ద పశువుల సంత నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జి.లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్, నాయకులు కట్ట సురేష్, వాకిటి శ్యామ్, మామిళ్ల కృష్ణ, కట్ట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

చేశారు. అల్వాల గ్రామపంచాయ తీలో అల్వాల నుండి పెద్దమంద డికి రూ. 4.75 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బి.టిరోడ్డు, గ్రామ పంచాయతీలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైన్ పనులకు ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. ఆ తర్వాత చిన్నమండడి గ్రామ పంచాయ తీలో రూ.10లక్షలతో నిర్మించనున్న సి.సి. రోడ్డు, రూ.5లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైన్ పనులకు ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు.వీరాయపల్లి గ్రామంలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైన్, సి.సి రోడ్డు పనులకు ఆర్డీఓ, గ్రామరాజకీయ ప్రతినిధులతో కలిసి శంఖుస్థాపన చేశారు. పామిరెడ్డిపల్లి గ్రామపంచాయతీలో రూ.20లక్షలవ్యయంతో నిర్మించనున్న సి.సి.రోడ్లు,డ్రైన్‌పనులకు శంఖుస్థాపన ఎమ్మెల్యే మేఘారెడ్డి శంకుస్థాపన చేశారు. పామిరెడ్డి పల్లి, జంగమయపల్లి బలిజపల్లి గ్రామాల్లో రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న సి.సి రోడ్లు, డ్రెయినేజీ పనులకు భూమి పూజ చేశారు. జంగమాయ పల్లి నుండి మమ్మయపల్లి వరకు రూ.1.50కోట్ల వ్యయంతో నిర్మిచనున్న బి.టి రోడ్డు పనులకు శాసన సభ్యులు శంఖుస్థాపన చేశారు. దొడగుంట పల్లి గ్రామ పంచాయతీలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సి.సి.రోడ్లు, డ్రైన్ పనులకు శంఖుస్థాపన ఎమ్మెల్యే మేఘారెడ్డి శంకుస్థాపన చేశారు. అంకాయ పల్లి తండా నుంచి దొడగుంట పల్లివరకు రూ.1.20కోట్లతో బీటీరోడ్డునిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా అంకయపల్లి తండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. అదేవిధంగా పెద్దమండడిలో రూ.5లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జగత్ పల్లి గ్రామ పంచాయతీలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న సి.సి.రోడ్లు, డ్రైన్ పనులకు శంఖుస్థాపన ఎమ్మెల్యే మేఘా రెడ్డి శంకుస్థాపన చేశారు. మణిగిళ్ల గ్రామ పంచాయతీలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న సి.సి.రోడ్లు, డ్రైన్ పనులకు శంఖుస్థాపన ఎమ్మెల్యే మేఘా రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, పెద్దమండడి ఎమ్మార్వో సరస్వతి, ఎంపీడీఓ సద్గుణ, సింగిల్ విండో డైరెక్టర్ సాయిచరణ్‌రెడ్డి,పంచాయతీరాజ్‌శాఖ డీఈ లక్ష్మినారాయణ, ఏఈలు, ప్రజాప్రతినిధులు,ఇతరఅధికారులు, ఆయాగ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు ,ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పాత ఎంపీడీవో కార్యాలయంలో అగ్ని ప్రమాదం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

శాఖ అధికారులు వెంటనే మంటలను అర్పివేసి మరింత నష్టం జరగకుండా మంటలను ఆర్పి నివారించారు. మంటలు పూర్తిస్థాయిలో ఆర్పి క్రమంలో కాలి బూడిదైన శవం కనిపించడంతో భయాందోళన గురై తిరిగి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై మంటల్లో కాలి బూడిదైన శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన షార్ట్ సర్క్యూట్‌తో లేక ప్రమాదవశాత్తు జరిగిందా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ సుదీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

## ఆరాధ్య కుటుంబాన్ని పరామర్శించిన ఆచారి

**వెల్దండ,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**వెల్దండ మండలం చోక్కన్నపల్లి గ్రామానికి చెందిన రమేష్ కూతురు ఆరాధ్య బాలానగర్‌లోని గురుకుల విద్యాలయంలో చదువుతూ ఆకాలంగా మృతి చెందడంతో మృతురాలి కుటుంబాన్ని ఆదివారం మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసి రూ.10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈసందర్భంగా ఆచారి మాట్లాడుతూ విద్యార్థి ఆరాధ్య మృతి ఎంతో బాధాకరమని, విద్యార్థి మృతి తనని కలచి వేసిందని, ప్రభు త్వం పూర్తి బాధ్యత వహించాలని మృతికి కారణమైన వాళ్ళని వెంటనే శిక్షించి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజెపి పార్టీ మండల అధ్యక్షులు కుర్మిద్ద యాదగిరి, వై.శేఖర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, కొండల్, విష్ణు గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శివప్రసాద్, పెద్దయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

## వ్యవసాయ నూతన భవన ప్రారంభం

**మాగనూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** మాగనూరు మండల కేంద్రంలో నల్లగట్టు మారెమ్మ దగ్గర ఆదివారం రోజు ప్రాథమిక వ్యవసాయ కేంద్రమండలి పిఎసిఎస్ నూతన భవనాన్ని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో వారు ఇరువురు మాట్లాడుతూ వరి కొనుగోలు చేసి వచ్చిన కమిషన్ ద్వారా ఎరువులను అమ్మి సంస్థకు ఆదాయం పెద్ద మొత్తంలో సమకూర్చి ఈ భవనానికి ఎక్కడ ప్రభుత్వ పరంగా డబ్బులు తీసుకోకుండా నిర్మించడం జరిగింది. మాగనూరు మండల కేంద్రం పిఎసిఎస్ నూతన భవనాన్ని నిర్మించడం పట్ల పాలక మండలి అభినందించడం జరిగింది. రాబోయే రోజుల్లో కూడా ఈ సంస్థకు కావలసిన గోదామును కూడా మంజూరు చేయించి మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని కోరడం జరిగింది. అంతేకాకుండా పిఎసిఎస్ బ్యాంకుకు సంబంధించి కేంద్రం పెద్ద మొత్తంలో సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని ఈ సందర్భంగా చెప్పడం జరిగింది. ఐదు ఎకరాల వ్యవసాయ పొలం ఉన్న ప్రతి రైతు కూడా కోళ్ల ఫారం, గొర్ల పెంపకం, పందుల పెంపకం 50 సబ్సిడీ కేంద్రం ఇస్తుంది. రైతులు పెద్ద మొత్తంలో వినియోగించుకోమని కోరారు.

## బీరప్ప పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే

**జీఎంఆర్‌కు ఘనంగా స్వాగతం పలికిన వేముల గ్రామ ప్రజలు**

**ముసాపేట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వేముల గ్రామంలో రెండు రోజులుగా యాదవులు బీరప్ప, ఎల్లమ్మ దేవత పండుగను ఘనంగా జరుపుకున్నారు. బీరప్ప పండుగ సందర్భంగా ఆదివారం దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి పాల్గొని గ్రామ బొడ్రాయికి కొబ్బరికాయ కొట్టి అనంతరం పులగంపాలకు మొక్కి దర్శనం చేసుకున్నారు. అనంతరం వేముల గ్రామ కురుమ యాదవులు సంఘం సభ్యులు, వేముల గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు గొంగడితో ఎమ్మెల్యేలు సన్మానించి గొర్రె పిల్లని బహూకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, బాల్‌నరసింహులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాట సుధాకర్, యాట సత్యనారాయణ, నాగేశ్వర్‌రెడ్డి, మాల వెంకటయ్య, గుజ్జుల నాగన్న, సుందు నరసింహులు, వేముల గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో ధ్వజకుంభారాధన

**బిజినేపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** నంది వడ్డేమాన్ శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి దివ్యాలయ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా ఆదివారం నూతన ఆలయ గరుడ ధ్వజస్తంభ ద్వారపాలకుల మహా సంప్రోక్షణం భక్తి శ్రద్దల మధ్య కొనసాగింది. శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరి సంపత్ కుమార్ రామానుజ జీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో, "ఆగమసార్వభౌమ" శ్రీమద్వాథూల సముద్రాల రమాకాంతాచార్య స్వామి వారి అనుగ్రహముతో పఞ్చాహ్నిక దీక్షతో భక్తి కార్యక్రమాలు నిర్వహించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణ మధ్య శాత్తుమొఱ, చతుస్థానార్చన, స్నపనం, హోమం, నివేదన, పూర్ణాహుతి, బలిప్రదానం, శాత్తుమొఱ, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ అష్టక్షరి జీయర్ స్వామి వారి ఆగమనం పూర్ణకుంభ స్వాగతం, ద్వారతోరణ ధ్వజకుంభారాధన, చతుస్థానార్చన, శయ్యాధివాసముఖి, హోమం, బింబస్థాపనము, నివేదన, పూర్ణాహుతి, బలిప్రదానము కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తిప్పిరెడ్డి నందకిషోర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## చిరు వ్యాపార దుకాణాలకు అడ్డంగా కట్టిన ప్లెక్సీలు

**ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకొని పంచాయతీ అధికారులు**

**ప్లెక్సీలు తొలగించి ఆదుకోవాలని వ్యాపారస్తుల ఆవేదన**

**లింగాల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** పొట్టకూటి కోసం చిరు దుకాణాలు పెట్టుకుంటే ప్రజాప్రతినిధులు మాత్రం ప్లెక్సీలు అడ్డంగా కట్టి పొట్టకొడుతున్నారని చిరు వ్యాపారస్తులు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళితే లింగాల మండల కేంద్రంలోని బోడ్రాయి సమీపంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షటర్ల లో పుట్ వేర్,టికోట్టు, హెయిర్ సెలూన్ తదితర దుకాణాలను ఏర్పాటు చేసుకొని రోజు వారి ఖర్చులు వెళ్ళదీసుకుంటు జీవిస్తున్నారు. కానీ ప్రజాప్రతినిధులు మాత్రం అవి ఏమి పట్టినట్లుగా పండుగలు, పుట్టినరోజులు నాయకులు వస్తే ప్లెక్సీలు అడ్డంగా కడుతున్నారని పలువురు చిరు వ్యాపారస్తులు వాపోయారు.ప్రస్తుతం గిరాకీ లేని షటర్ల కిరాయిలు కట్టలేక, ఇల్లు గడవక రోడ్డున పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ అధికారులకు ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి దుకాణాలకు అడ్డంగా ఏర్పాటు చేసిన ప్లెక్సీలను తొలగించి ఆదుకోవాలని కోరుతున్నారు.

## శ్రీ శ్రీ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

**-పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**కల్వకుర్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**కల్వకుర్తి పూర్వపు నియోజకవర్గంలోని తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో వైభవంగా నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ లక్ష్మి నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి దేవాలయం పూజారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనతరం కళ్యాణోత్సవ కార్యక్రమంలో పాల్గొని తిలకించారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ భగవంతుని ఆరాధన, కళ్యాణ కార్యక్రమాలు నిర్వహించడం శుభసూచికమన్నారు. సరైన సమయంలో పాడి పంటలు పడడం, ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు సంక్షేమం కోసం ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కొంత సమయం దైవ చింతన కలిగి ఉండాలని, ఇలాంటి వారోత్సవాల్లో పాల్గొనడం అదృష్టం, సంతోషంగా ఉందన్నారు. లక్ష్మినరసింహ స్వామి ఆశీస్సులు అందరికి ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో పాడి పంటలు సమృద్ధిగా పండాలని లక్ష్మి నరసింహ స్వామిని కోరుకున్నట్లు అని తెలిపారు. అనంతరం దేవాలయం నిర్వాహకులు ముఖ్య అతిథిలను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డ్ సభ్యులు ఠాకూర్ బాలాజీసింగ్, నాయకులు సురేందర్ రెడ్డి, భక్తి బృందం, స్థానిక నాయకులు, కార్యకర్తలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వం హామీలన్నీ నెరవేర్చేవరకు ప్రజల తరుపున పోరాడుతాం

**జనసేన పార్టీ వనపర్తి కోఆర్డినేటర్ ముకుంద నాయుడు**

**వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీ ప్రాంతీయ పార్టీగా గుర్తింపు పొందినందుకు ఎంతో శుభదాయకం అని రిజిస్టర్ పార్టీ నుంచి గుర్తింపు పొందిన పార్టీగా జనసేనను ప్రకటించినందుకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని జనసేన పార్టీ వనపర్తి కోఆర్డినేటర్ ముకుంద నాయుడు పేర్కొన్నారు. ఇటీవలే ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో వంద శాతం, విజయం సాధించి ఎన్నికల సంఘం నుంచి గుర్తింపు పొందిన పార్టీగా ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని అదేవిధంగా తెలంగాణలో కూడా గుర్తింపు పొందిన పార్టీగా నేడు జనసేన పార్టీ ఉండడం తెలంగాణ జన సైనికులకు మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని తెలిపారు. అలాగే తెలంగాణ స్థానిక ఎన్నికల్లో జనసేన పార్టీ ఎన్నికల గుర్తుగా గాజు గ్లాసును రిజర్వ్ చేయడం సామాన్యుల్లోకి పార్టీ దగ్గర అవుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత పదేళ్లుగా పరిపాలించిన బిఆర్ఎస్ పార్టీ ప్రజలకు హామీలు నెరవేర్చలేక ఓటమి పాలైందని అలాగే ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అనేక హామీలతో అధికారంలోకి వచ్చి నేడు హామీల కల్పనలో సంవత్సరం ముగిసిన ఇంకా హామీలు మొదలుపెట్టలేక ప్రజలను మభ్యపెడుతూ వస్తుందని కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరిచే వరకు జనసేన పార్టీ తరపున ప్రజలకు అండగా పోరాడుతామని తెలిపారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని ఈ విషయంపై త్వరలోనే రాష్ట్ర అధిష్టానం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఒక నిర్ణయం తీసుకుంటారని, అలాగే తెలంగాణ ఇంచార్జ్ శంకర్ గౌడ్ ఆదేశాల మేరకు అధిష్టానం పెద్దల సూచనలతో భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకొని పనిచేస్తామని తెలిపారు. జనసైనికులు అందరూ వచ్చే స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సర్పంచ్ ఎన్నికలతో పాటు ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలపై పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు పని చేసుకుంటూ ప్రజల తరఫున నిలవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకులు మచ్చ ఉతేజ్, ఆర్ కృష్ణ, వినోద్ కుమార్, లింగేష్ యాదవ్, ప్రవీణ్, శివ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశావహుల వేటలో అధికార పక్షం

**చిన్న చింతకుంట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** రాబోయే జడ్పీ, మండల పరిషత్ ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహుల వేటలో అధికార పక్ష నేతలు ముందస్తు సమావేశాలు నిర్వహిస్తున్నారు. జడ్పీ, మండల పరిషత్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపికను పార్టీ కార్యకర్తల సమక్షంలో అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ప్రతిపక్షాల ఎత్తుగడలను గమనిస్తూనే రాబోయే స్థానిక ,జడ్పీ, మండల పరిషత్ ఎన్నికల్లో ప్రజాదరణ, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న నేతలను గుర్తిస్తూనే కార్యకర్తలు అభిప్రాయాలను గౌరవిస్తూ ఆశావాహుల పేర్లను తీసుకుంటున్నారు. గ్రామాలలో కార్యకర్తల మధ్య భేదాభిప్రాయాలు లేకుండా అభ్యర్థులు ఎంపిక చేసేందుకు కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశాలను నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. మండలంలో 11 ఎంపీటీసీ స్థానాల లో ఆశావాహుల జాబితాను తయారుచేసి స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డికి అందజేస్తామని వాటిలో ప్రజాదరణ ఉండి, పార్టీ సిద్ధాంతాలు కట్టుబడి ఉన్న వారిని స్థానిక ఎమ్మెల్యే ఎంపిక చేస్తారని దానికి మండల పార్టీ నేతలు ఆశావాహులు కట్టుబడి ఉండాలని మండల కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. తాజాగా లాల్ కోట గ్రామంలో ఎంపిటిసికి పోటీచేసే ఆశావాహుల పేర్లను తీసుకోవడం జరిగిందని మండల కాంగ్రెస్ పార్టీ తెలిపింది. రాబోయే స్థానిక, జడ్పీ, మండల పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా ఇప్పటి నుంచే వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు.వాటిల్లో పాత ,కొత్త అనే భేదం లేకుండా అందర్నీ కలుపుకుపోతూ సమర్థులను ఎంపిక చేసేందుకు ఆయా గ్రామాల్లోని కార్యకర్తల సమావేశాలు ఎంతో దోహదపడుతున్నాయి. సోమవారం అమ్మాపూర్, గూడూరు గ్రామాల కార్యకర్తలతో ఎంపీటీసీ స్థానానికి పోటీ చేసే ఆశావాహుల పేర్లను సేకరించేందుకు సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు మండల పార్టీ నేతలు తెలిపారు.

09ఎంబిఎన్ఆర్ 15: లాల్‌కోటలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

## అభిమన్యు రెడ్డి లక్షన్నర విరాళం

**కావేరమ్మపేటని బంగారు మైసమ్మ ఆలయ అభివృద్ధికి అందజేత , చెక్కు అందజేసిన కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్ రెడ్డి**

**జడ్చర్ల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట ఐబి బంగ్లా సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి, అభివృద్ధి నిమిత్తం బిఆర్ఎస్ యువ నాయకుడు చించోడు అభిమన్యు రెడ్డి రూ.1.50 వేల రూపాయల నగదును విరాళంగా అందజేశారు. 24వ వార్డు కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్ రెడ్డి, 2వ వార్డు కౌన్సిలర్ బుక్క మహేష్, నాయకులు కృష్ణారెడ్డి, లింగం, మహేష్‌గౌడ్‌లు ఆదివారం దేవాలయాన్ని సందర్శించి బంగారు మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి రూ.1.50 చెక్కును దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కోట్ల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ యువ నాయకులు అభిమన్యురెడ్డి దేవాలయాల,బడులనిర్మాణానికి ఆర్థికసహాయం అందజేయడంలో ముందుంటారని,అందులో భాగంగానే శ్రీ బంగారు మైసమ్మ దేవాలయ అభివృద్ధి నిమిత్తం రూ. లక్ష 50 వేల చెక్కును అందజేయడం జరిగిందన్నారు. గుడి, బడి అభివృద్ధికి తాను ఎల్లవేళలా అండగా ఉంటారని తెలిపారు. ఎల్లప్పుడూ ప్రజల్లో ఉంటూ యువత అభిమానాన్ని చూరగొన్న నాయకుడు అభిమన్యు రెడ్డి పేర్కొన్నారు.కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు గోనెల నరేందర్, గుండు చంద్రశేఖర్, మిద్దె నాగరాజు, జయ శ్రీవాత్సవ్ ఉన్నారు.

## నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ చట్టబద్ధంగా జరగాలి



మాట్లాడుతున్న వెంకట్రామ్ రెడ్డి

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 9 ప్రభాత వార్త :** నారాయణపేట కోడంగల్ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ చట్టబద్ధంగా జరగాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి .వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు.ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.అన్ని విధాలుగా వెనకబాటుకు గురైన నారాయణపేట ప్రాంతానికి సాగునీరు చాలా ముఖ్యమని అయితే ఈ ప్రాజెక్టు కోసం సేకరిస్తున్న భూసేకరణ చట్టబద్ధంగా జరగాలని గ్రామ సభలను నిర్వహించి రైతులను ఒప్పించాలని అధికారులను కోరారు. రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అకస్మాతుగా రైతుల పొలాల్లోకి వెళ్లి అధికారులు సర్వేలకు పూనుకుంటే రైతులు తీవ్ర ఆందోళన గురవుతున్నారని అన్నారు. అధికారుల హడావుడి వ్యవహారం వల్ల నారాయణపేట కోడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు సర్వేకు ఆటకం కలిగే అవకాశం ఏర్పడకూడదని హితవు పలికారు.ఈ ప్రాంత అభివృద్ధి కోసం నారాయణపేట కోడంగల్ ఎత్తిపోతల పథకానికి రైతులు తప్పకుండా సహకరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, బి.బాల్ రామ్, జోషితో బాటు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో ముదిరాజులు సత్తా చాటాలి: అధ్యక్షుడు మొగులప్ప

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** ముదిరాజ్‌లు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని రాబోయే స్థానిక ఎన్నికల్లో తమ సత్తా చాటాలని మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మొగులప్ప అన్నారు. ఆదివారం క్యాతన్‌పల్లి గ్రామంలో ముదిరాజ్ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా ఆయనతోపాటు ముదిరాజ్ నాయకులు దామరగిద్ద మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, కందెన్ పల్లి మాజీ ఎంపిటిసి అంజి, ముస్కన్ పల్లి గ్రామ మాజీ సర్పంచ్ మొగులప్ప మాట్లాడుతూ ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉండి రాబోయే స్థానిక ఎన్నికల్లో తమ సత్తాను చాటాలన్నారు. బరిలో ఉంటున్న తమ అభ్యర్థుల గెలుపు కోసం ముదిరాజ్ వ్యవస్థ ఐక్యంగా పని చేయాలన్నారు. గ్రామాల్లో జనాభా ముదిరాజులది పదవులు మరొకరివన్నారు. ఐక్యత లేని కారణంగానే రాజకీయపరంగా రాణించలేక పోతున్నామన్నారు. ముదిరాజ్ యువకుడు, నాయకులు, ముదిరాజ్ బంధువులంతా గ్రామాల్లో చైతన్యవంతం కావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పనిచేసి ముదిరాజ్ నాయకుని ప్రజా ప్రతి నిధిగాఎన్నుకోవాలన్నారు ముదిరాజులు ఆర్థికంగా రాజకీయంగా ఎదిగినప్పుడే హక్కులు సాధించుకోవడం సాధ్యమన్నారు.ముదిరాజుల్లో అక్షరాక్షత శాతాన్ని పెంచి మరింత చైతన్య మంత్రం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ నాయకులు ఆర్.నర్సింహ, మైపాల్, అంజిలప్ప, నీలి వెంకట రాములు, చాపల శ్రీనివాస్, మొగులప్ప, ఆయా గ్రామాల ముదిరాజ్ సంఘం నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## యువతలో నైపుణ్యం పెంపొందించింది టాస్క్ పనిచేస్తుంది

**- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**కల్వకుర్తి, ఫిబ్రవరి 09 ప్రభాతవార్త:**హనుమాన్ దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలంగాణ స్కిల్ డెవలప్మెంట్ టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతలో నైపుణ్యాలను వెలికితీసి యువశక్తిని వృత్తిపరచడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికల రూపొందిస్తుందన్నారు. గ్రామాల్లో పర్యటించడం చాలా సంతోషకరంగా ఉందని, నిర్మాణంలో ఉన్న హనుమాన్ దేవాలయ నిర్మాణం పూర్తి చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని, నియోజకవర్గ వ్యాప్తంగా ఐక్యత ఫౌండేషన్ ద్వారా దేవాలయాల అభివృద్ధికి సహకారం అందించామని, అందిస్తున్నామని, మున్ముందు కూడా కొనసాగిస్తామని తెలిపారు. యువశక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం బృహత్తరమైన కార్యక్రమాలు చేపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఘనంగా శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పి.లింగారెడ్డి, అల్వాల్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, పరమేశ్వర్, బన్నె శ్రీను, బన్నె శ్రీధర్, ఎస్.రాములు, ఎల్.ఆంజనేయులు, రామకృష్ణలతో పాటు గ్రామస్తులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేట శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం




**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** సమాజ శ్రేయస్సు కోసం యువత పాటుపడాలని శిశుమందిర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దత్తురావు చౌదరి అన్నారు. జిల్లా కేంద్రంలోని షీలా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం 2007, 2008 సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సరస్వతి మాత చిత్రపటానికి పూజలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జీవితంలో ఏ స్థాయిలో ఉన్నా తల్లిదండ్రులను గురువులను మరిచి పోరాదన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో విద్యార్థులు పాఠశాల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని మాట్లాడారు. అనంతరం ఆచారి, మాతాజీలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. సరదాగా ఆటపాటలతో గడిపారు. కాగా 2007,08 పదో తరగతి బ్యాచ్ తరపున పూర్వ విద్యార్థులు పాఠశాలకు సిసి కెమెరాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు రాములప్ప, పద్మమ్మ, పటేల్ విజయలక్ష్మి, లక్ష్మితో పాటు పూర్వ విద్యార్థులు సుమారు 50 మంది పాల్గొన్నారు.

## పాలమూరు బిడ్డకు అరుదైన గౌరవం

**మిజోరాం సెంట్రల్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకం**



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** మిజోరాం సెంట్రల్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన డా.చంద్రశేఖర్ రెడ్డి నియామకమయ్యారు. పెద్ద కొత్తపల్లికి చెందిన యాదగిరి రెడ్డి, మంజుల దంపతుల తనయుడు చంద్రశేఖర్ రెడ్డి మిజోరాం సెంట్రల్ విశ్వవిద్యాలయంలో సోషియాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా తన విధులు నిర్వర్తిస్తున్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో సోషియాలజీలో డిగ్రీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్డీ పూర్తిచేసిన ఆయన అనంతరం గీతం విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు ప్రారంభించారు. అక్కడ తన బోధన పరిశోధనను కొనసాగించిన అనంతరం మిజోరాం సెంట్రల్ విశ్వవిద్యాలయంలో చేరారు. ఆయన పెద్దకొత్తపల్లి జెడ్పీ హైస్కూల్‌లోనే తన పాఠశాల విద్యను పూర్తి చేసి నారాయణపేట జిల్లాలోని సూర్యలక్ష్మి జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. ఉన్నత విద్యకోసం హైదరాబాద్‌కు వెళ్లి ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేశాడు.

## మహబూబ్‌నగర్‌లోనే అత్యధిక డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

**అన్ని వసతులు కల్పించి ఏర్పాటు చేశాం..**

**దివిటిపల్లి డబుల్ బెడ్ రూమ్ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్**



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని దివిటిపల్లిలోని కెసిఆర్ నగర్ డబల్ బెడ్ రూమ్‌ల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ జిట్ట ఆంజనేయస్వామి విగ్రహం, నవగ్రహ, ధ్వజస్తంభం, పోచమ్మ, నాభిశిల బొడ్రాయి, ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేద ప్రజలకు సొంత ఇంటి కలను కెసిఆర్ ప్రభుత్వం సాకారం చేసిందని తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా డబల్ బెడ్ రూమ్స్‌ని మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో నిర్మాణం చేసినట్లు చెప్పారు. పూర్తిస్థాయి వసతులు కల్పించి పేదలకు ఇండ్లు అప్పగించినట్లు తెలిపారు. పూజ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయం చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ కేసి నర్సింహులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థి ఉన్నత చదువుకు సహాయం

**కల్వకుర్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన నరహరి అక్షిత అనే విద్యార్థినీ ఇంజనీరింగ్ చదువుతున్నది. నిరుపేద విద్యార్థిని అక్షిత కళాశాల ఫీజుకు ఆదివారం మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు మిత్ర ఫౌండేషన్ ఎల్లప్పుడు ఎప్పుడు ముందు ఉంటుందని మాజీ అధ్యక్షులు కుడుముల చంద్రకాంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థి తండ్రి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నుండి బిఆర్ఎస్‌లోకి చేరికలు

**మద్దూర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని మద్దూర్ మండలం పల్లెగడ్డ తండా గ్రామానికి చెందిన 10 మంది యువకులు ఆదివారం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎస్.రవి, జి.బాబు, ఎన్.రాజు, ఎన్.కిషన్, ఎన్.బబ్లు, ఎం.అనిల్, కె.రాజు, ఎన్ సునీల్,పల్లెగడ్డ తండా టిఆర్ఎస్ అధ్యక్షుడు శీను టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీఎస్ కలువలో గుర్తు తెలియని శవం లభ్యం

**అయిజ ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఉప్పల గ్రామ శివారులోని ఆర్డీఎస్ కాలువలో ఆదివారం గుర్తు తెలియని మగ శవం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం శవం అందాజ 45 నుండి 50 సంవత్సరాలు ఎత్తు 5.3 ఎరుపు టీ షర్టు ఫుల్ తెల్లని దావతి ఫుల్ బనియన్ అండర్వేరు ధరించి ఉన్నాడని శవానికి గొంతులో ఎరుపు రంగు దారం ఉండి తాయత్తు ఉన్నట్లు తెలిపారు. ఈ శవాన్ని గుర్తించిన వారు అయిజ పోలీసులకు సమాచారం అందించాలని స్థానిక ఎస్సై శ్రీనివాసరావు కోరారు.

## 23వ వారం విజయవంతంగా ఉచిత భోజనం

**నవాబుపేట,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** నవాబుపేట మండల కేంద్రంలోని జెకె ట్రస్ట్ ఆధ్వర్యంలో 23వవారం ఆదివారంరోజు ఉచిత భోజనకార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. జేకే ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫతేపూర్ మైసమ్మ దగ్గర వానర సమూహమునకు (కోతులకు) పండ్లు కూరగాయలు ఆహారంగా పంపిణీ చేయడం జరిగింది.కార్యక్రమంలో జెకెట్రస్టు మండలవ్యాపార సంఘ అధ్యక్షులు (ఎంబీఏపి) సుధాకర్‌చారి, నవాబుపేట డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ పుట్టి ఆంజనేయులు, మాజీ ఎంపిటిసి మండల కాంగ్రెస్ నాయకులు పుట్టోనిపల్లి లోకేష్, నవాబుపేట డెవలప్మెంట్ కమిటీ వైస్ చైర్మన్ టంకర నిరంజన్, జెకె ట్రస్ట్ డైరెక్టర్ హృదయ్ పవిత్ర చారి, ఎన్‌డిసి డైరెక్టర్ పుట్టి మహేష్ కుమార్, జెకె ఆఫీస్ ఇంచార్జ్ నాగలింగం,డీకే రఘు, నరేష్, కృష్ణయ్య,పాల్గొన్నారు.

## రైతు దీక్ష సభకు రైతులు తరలి రావాలి

**మద్దూర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో ఆదివారం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సోమవారం పట్టణ కేంద్రానికి బిఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రైతు దీక్ష సభకు వస్తున్నందువలన మద్దూర్ ఉమ్మడి మండలం నుంచి భారీగా రైతులు తరలి రావాలని కార్యకర్తల సమావేశంలో ఆయన రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ మాజీ సభ్యుడు సలీం మండల పార్టీ అధ్యక్షుడు వంచర్ల గోపాల్, కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీరారెడ్డి, దమగ్నాపూర్ మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ జాతర మహోత్సవము

**నారాయణపేటటౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**దామరగిద్ద మండల కేంద్రంలో వెలసిన శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ దేవత జాతర మహోత్సవము ఈనెల 11న మంగళవారం జరుగుతుందని ఆలయ కమిటీసభ్యులు క్షీరసాగరే లక్ష్మిబాయి, నారాయణ,బుల్లెట్ సూరి,తులసిరాం,బాలు తెలిపారు.ఈసందర్భంగా జాతర జరుగుతుం దని వారు పేర్కొన్నారు. జాతర ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య

**నవాబుపేట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** వివాహం కావడం లేదని చెట్టుకి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురుకుంట గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని గురుకుంట గ్రామానికి చెందిన పుట్ట మధు తండ్రి పుట్ట యాదయ్య ముదిరాజు (37). గత 5 సంవత్సరాల క్రితం ఆటో బోల్తా పడి తలకు గాయమైన పుట్ట మధుకు కింద పడినప్పటి నుండి అప్పుడప్పుడు మూర్చ,(పిట్స్ )రావడంతో సంబంధాలు వెతకగా ఎవరు కూడా అమ్మాయిని ఇవ్వడానికి ముందుకు రాకపోవడంతో మనస్థాపంతో పెళ్లి కావడం లేదని ఆదివారం అబ్దుల్ సమీప వ్యవసాయ పొలంలోని పొలంవద్ద దాదాపు 12 గం.ల 45 నిమిషాలకు చింతచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతున్ని ఎస్సై విక్రం పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

